క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీసీ పద్మావతి

రణస్థలం: ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్నికల పరిశీలన అధికారి, కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి తెలిపారు. మండలంలోని సంచాం పంచాయతీలో 143, 144 పోలింగ్ కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, థర్డ్ జండర్‌లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు పనిచేసే తీరును వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యుత్ సదుపాయం, తాగునీటి కల్పన, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ర్యాంపుల ఏర్పాటు వంటివి పరిశీలించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్, వీఆర్వో బలివాడ శంకరరావు, పంచాయతీ సర్పంచ్ రెడ్డి రాము, పార్టీ నాయకుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



అంగన్‌వాడీ సిబ్బందితో ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి చొరవ చూపి తెరిపించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో ఆమె మాట్లాడుతూ సమస్యల పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

బీటీ రోడ్డు పనులు మంజూరు

గార: మండలంలో ఐదు బీటీ రోడ్డు పనులు మంజూరయ్యాయని ఎంపీపీ గొండు రఘురామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌పీ రోడ్డు నుంచి కొర్ని, కొర్లాం మీదుగా కొమరవానిపేట వరకు, సీఎస్‌పీ రోడ్డు నుంచి బందరువానిపేట సముద్ర తీరం మీదుగా మొగదాలపాడు వరకు, సీఎస్పీ రోడ్డు నుంచి అంపోలు మీదుగా బీటీ రోడ్డు పనులు, గార- చింతాడ రోడ్డు నుంచి శాలిహుండం వరకు, సీఎస్పీ రోడ్డు నుంచి బందరువానిపేట వరకు బీటీ రోడ్డు పనులకు రూ.3 కోట్ల 57 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. పనుల మంజూరుపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీస గోపి, కొర్లాం, కొమరవానిపేట సర్పంచ్‌లు పీస శ్రీహరిరావు, వారాది రాంబాబు, బందరువానిపేట మత్స్యకార సంఘ నాయకులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ధన్యవాదాలు తెలిపారు.

6న ధ్యానమందిరం ప్రారంభం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో సాయిదర్బార్ మందిరం వద్ద దత్త గురు పరంపర ధ్యాన మందిరాన్ని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దత్తాత్రేయుడు, శ్రీపాద వల్లభుడు, శ్రీనృసింహ సరస్వతి, మాణిక్ ప్రభు, అక్కల్‌కోట్ మహారాజ్‌లతో కూడిన భజన మందిరం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఘనంగా అనఘావ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో ప్రధాన అనఘాష్టమిని పురస్కరించుకుని గురువారం సామూహిక అనఘా వ్రతాలు నిర్వహించారు. దత్తహోమం అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దత్త జ్ఞాన బోధ సభ శ్రీకాకుళం ట్రస్టు సభ్యులు, జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ..



అసిరినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో నిజం గెలవాలి యాత్ర పేరిట నారా భువనేశ్వరి గురువారం పర్యటించారు. దవళపేట గ్రామానికి చెందిన కంచరాన అసిరినాయుడు కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు, రామ్‌మల్లిక్‌నాయుడు, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

ఆరోగ్యానికి అండగా..!



నా పేరు కె.నాగేష్. మాది ఎచ్చెర్ల మండలంలోని ఎస్‌ఎం పురం గ్రామం. నేను కొన్ని నెలలుగా దగ్గు, ఆయాసంతో బాధపడుతూ ఉండేవాడిని. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగడం వలన చాలా ఖర్చు అయ్యేది. అయితే మా ఊరు ఆశ కార్యకర్త సూచనతో ఎచ్చెర్ల పీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యానికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి వారం పరీక్షలకు రావాలని సూచించారు. ఇలా నాకు మెరుగైన వైద్య సేవలు ప్రస్తుతం అందుతున్నాయి. పీహెచ్‌సీలో వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులతో ప్రస్తుతం నా ఆరోగ్యం కుదుటపడుతోంది. మాలాంటి నిరుపేదలకు ఉచిత సేవలందించడానికి పీహెచ్‌సీల్లో వసతులు మెరుగుపరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజారోగ్యం విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. పేదలకు నాణ్యమైన వైద్యం తమ గ్రామాల్లోనే అందాలనే ఉద్దేశంతో పీహెచ్‌సీల్లో వసతులు మెరుగయ్యేలా చర్యలు తీసుకున్నారు. నాడు–నేడు పథకం తీసుకొచ్చి ఆస్పత్రుల రూపురేఖలు సమూలంగా మార్చివేశారు. వసతుల్లో కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది పేదింటికి పెద్ద కొడుకు అయ్యారు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో అందుతున్న సేవలపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్





ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

- పీహెచ్‌సీల అభివృద్ధితో ఆరోగ్య ధీమా
- సరికొత్త వసతులతో పీహెచ్‌సీలు
- నాడు–నేడులో భాగంగా రూ.50 లక్షలతో అభివృద్ధి

ఎచ్చెర్ల మండలంలోని ఎచ్చెర్ల, పొన్నాడ గ్రామాల్లో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఎచ్చెర్ల పీహెచ్‌సీ పరిధిలో 16 గ్రామ సచివాలయాలకు, పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలో 12 గ్రామ సచివాలయాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వైద్య సేవలు షెడ్యూల్ మేరకు అందజేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్

పీహెచ్‌సీలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పల్లె జనాలకు వైద్యాన్ని మరింత చేరువ చేసింది. షెడ్యూల్ మేరకు ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. మరో పక్క జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గుర్తించిన రోగులను వైఎస్సార్ ఆరోగ్య శ్రీకి రిఫర్ చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. షుగర్, బీపీ వంటి పది రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నారు. డాక్టర్ ఇంటికి వస్తారన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించారు.



పీహెచ్‌సీలో షుగర్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

8500 మందికి ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష కింద గత నెలలో సచివాలయాల వారీగా 28 వైద్య శిబిరాలు నిర్వహించారు. దీనిలో భాగంగా రెండు పీహెచ్‌సీల పరిధిలో 8,500 మందికి పది రకాలు పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలకు సిద్ధమవుతున్నారు. అవసరమైన రోగులకు ఈసీజీ, డెంగీ జ్వరం నిర్ధారణ, మలేరియా నిర్ధారణ, క్షయ పరీక్షలు చేశారు. ఈవిధంగా తమకు తెలియని జబ్బులు ఉన్నవారిని గుర్తించి వైద్య సేవలు అందించి, మందులు అందజేస్తున్నారు. కొందరు రోగులకు ఆరోగ్య శ్రీ కింద శ్రీకాకుళం రిమ్స్, స్థానికంగా ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు సైతం రిఫర్ చేస్తున్నారు. పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉషశ్రీ

నాడు

పీహెచ్‌సీల్లో చాలా వరకు అరకొర వైద్యం అందేది. డాక్టర్లు ఉన్నా మందులు ఉండేవి కాదు. వైద్యుని పోస్టు ఖాళీగా ఉంటే సకాలంలో నియామకం జరిగేది కాదు. పారాసిటమల్, కొన్ని సిరప్‌లు అందితే చాలు రోగులు అదృష్టమనుకునే వారు. లేదంటే నిరాశతో ఇంటికి వెనుదిరిగేవారు.

నేడు

పీహెచ్‌సీలు కార్పొరేట్ ఆస్పత్రులు స్థాయిలో అభివృద్ధి చెందాయి. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీకి రూ.50 లక్షలు మంజూరు చేశారు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారు. పూర్తిస్థాయి సిబ్బంది, అందుబాటులో అన్నిరకాలు మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు వంటి సౌకర్యాలు కల్పిస్తూ ప్రతి పల్లెకు ఆరోగ్య ధీమా కల్పించారు.

వైద్యం చేరువైంది



పీహెచ్‌సీల మార్పు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వలన ప్రజలకు వైద్యం చేరువైంది. మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాలు టెస్టులు పీహెచ్‌సీల్లో, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల్లో నిర్వహిస్తున్నారు. మరోపక్క వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిధి రూ.25 లక్షలకు పెంచారు. ఈ ప్రభుత్వంలో మెరుగైన వైద్యం, ఉన్నత వైద్యం, వ్యాధి నిర్ధారణ వంటి చర్యలు సాధారణ ప్రజలకు సైతం చేస్తున్నారు. ఈ మార్పు మంచి పరిణామం.

పి.మల్లేశ్వరావు, ఫరీదుపేట

టీడీపీ మాయమాటలు నమ్మవద్దు



శ్రీకాకుళం రూరల్: పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: టీడీపీ మాయమాటలు నమ్మవద్దని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పింఛన్‌ను ప్రతి ఏడాది రూ.250 చొప్పున అంచెలంచెలుగా పెంచుకుంటూపోతామని ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు రూ.3000 పెంచి అమలు చేశారని స్పష్టం చేశారు. సింగుపురంలో గురువారం సామాజిక పెన్షన్ల పెంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రూ.3వేలు పింఛన్‌ను ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోనే ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ యువనాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీనే అధికారంలోకి తీసుకురావాలన్నారు. సింగుపురం గ్రౌండ్ అభివృద్ధికి మంత్రి ధర్మాన రూ.10లక్షలు మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు బగ్గు అప్పారావు, గుండ మోహన్, గుండ ఆదిత్యనాయుడు, నక్క శంకర్, డీపీ దేవ్, తహశీల్దార్ ఎన్.వెంకట్రావు, ఎంపీడీఓ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: అవ్వాతాతలకు అందించే పెన్షన్ పెంపును పండుగలా నిర్వహించుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పిలుపునిచ్చారు. పెదపాడు, ఖాజీపేట గ్రామాల్లో గురువారం పలువురికి పెన్షన్లు పంపిణీ చేశారు.

పేదల ఇళ్లల్లో సంతోషం



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- పింఛన్ల పంపిణీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: పెంచిన పింఛన్లతో(రూ.3 వేలు) పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే గ్రామ వలంటీర్లకు, సచివాలయం సిబ్బంది సమాచారం ఇవ్వాలన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలబడాలని కోరారు. చంద్రబాబు పాలనలో ఎక్కడ చూసినా ఆకలి కేకలే తప్ప.. ఎప్పుడూ పేదవాడి బాగుకోసం కృషి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు కంది రమాదేవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమని, తోలేటి వెంకటరావు, సర్పంచ్‌లు ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ కె.నిశ్చల తదితరులు పాల్గొన్నారు.

లూయిూ బ్రెయిలీ చిరస్మరణీయుడు



బ్రెయిలీ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసరావు, ఐఈఆర్టీ టీచర్లు



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అల్లు రమ, శ్రీనివాసరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని భవిత కేంద్రంలో గురువారం లూయిూ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రపంచ అంధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భవిత కేంద్రంలో ఐఈఆర్టీల సమక్షంలో బ్రెయిలీ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా బి.కుసుమ కుమారి, చెల్లెమ్మ మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులని నింపిన మహోన్నతుడు బ్రెయిలీ అని కొనియాడారు. అంధులు నేడు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారంటే దానికి కారణం బ్రెయిలీ తన అక్షరలిపియేనని కీర్తించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకు కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని జిల్లా అంధుల సంక్షేమ సంఘం కార్యదర్శి అల్లు రమ అన్నారు. శ్రీకాకుళంలో గురువారం బొడ్డు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లూయిూ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పి.జగ్గారావు, సీహెచ్, రాంబాబు, పి.రామప్రసాద్, బొడ్డు లక్ష్మి, పి.శారద, గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లయిన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: లూయిూ బ్రెయిలీ చూపులేని వారికి కరదీపికగా నిలిచారని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయంలో గురువారం వరల్డ్ బ్రెయిలీ డే నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న దివ్యాంగులు అల్లు రమ, ముంగటి రాజులమ్మ, కిల్లి మంజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి టి.రామ్‌గోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ సీపాన రమేష్ కుమార్, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, సభ్యులు గణపతి, తిరుమలరావు, భారతి, ఉర్లాం రవితేజ, పాడుగు చరణ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

గార: మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉందని డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. గురువారం వత్సవలస సచివాలయం వద్ద వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెలుకోటి అప్పారావు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీస గోపి, ఎంపీడీఓ సంజీవి రమణయ్య, అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి

సంక్షిప్తంగా..

బార్ అసోసియేషన్ సమావేశం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూ యాజమాన్య హక్కు చట్టంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం, స్థిరాస్తి కేసులన్నింటినీ స్వీకరించాలని కింది కోర్టులను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 1 నాటికి వాయిదా వేసిన నేపథ్యంలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు బార్ అసోసియేషన్ భవన్‌లో జరిగే ఈ సమావేశానికి న్యాయవాదులంతా హాజరుకావాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము కోరారు.

కాలభైరవస్వామికి అభిషేకాలు




పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా గురువారం స్వర్ణాకర్షణ భైరవ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సాయినాథుడు

6న మంచినీటి సరఫరా బంద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బలగలోని హెడ్‌వాటర్ వర్క్స్ 1200 కేఎల్ 300ఎంఎం డిస్ట్రిబ్యూటరీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 6న ఉదయం, సాయంత్రం వేళల్లో మంచినీటి సరఫరా ఉండదని కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్‌కాలనీ, నానుబాలవీధి, కానుకుర్తివీధి, పుణ్యపువీధి, బుక్కావారిబందా, ఇలిసిపురం, బలిజేపల్లివీధి, చిన్నబజార్, రెల్లివీధి, హడ్కోకాలనీ, బలగ, రిమ్స్ హాస్పిటల్ ఏరియా, రాయ్‌లేఔట్ కాలనీ, మహిళా మండలివీధి, తురాయిచెట్టువీధి, వైష్ణవువీధి, కెల్లవీధి, దుర్గాదేవిగుడి వీధి, గుడివీధి తదితర ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ

గార: కె.మత్స్యలేశం ప్రాథమికోన్నత పాఠశాలకు హరిహరరెడ్డి రూ.20 వేలు విలువైన ఇన్వర్టర్‌ను సర్పంచ్ బి.ఎర్రన్న చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో మైలపల్లి సూర్యనారాయణ, వాసుపల్లి కృష్ణమూర్తి, రాయితీ సూర్యనారాయణ, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.